

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

జిల్లావ్యాప్తంగా ఆదివారం తొలి ఏకాదశి పూజలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. అన్నవరం, సామర్లకోట, పిఠాపురంతో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పిఠాపురం పాదగయ క్షేత్రంలో నందీశ్వరుడిని అలంకరించిన దృశ్యం

పెంపుడు జంతువులకు ఏడాదికోసారి వ్యాక్సినేషన్ చేయించాలి

» పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) డాక్టర్ కె.కృష్ణమూర్తి

కాకినాడ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులైన పలు రకాల కుక్కలు, పిల్లుల పట్ల నిర్లక్ష్యం తగదని, వాటికి ఏడాది కోసారి యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ (ఏఆర్‌వీ) వేయించడం ద్వారా ఎటువంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా సురక్షితంగా ఉండవచ్చని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) డాక్టర్ కె.కృష్ణమూర్తి జంతు ప్రేమికులకు సూచించారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని కాకినాడ పశుసంవర్ధకశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశువులు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి జంతు ప్రేమికులకు క్షుణ్ణంగా వివరించారు. పెంపుడు కుక్కలకు, వీధి కుక్కలకు నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వెటర్నరీ ఆస్పత్రుల్లో ఉచితంగా ఏఆర్‌వీ వ్యాక్సీనేషన్ వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 613 పెంపుడు కుక్కలకు, 13 పెంపుడు పిల్లులకు ఉచితంగా వ్యాక్సినేషన్ వేసినట్లు జేడీ తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌వో) డాక్టర్ పృథ్వీచరణ్, వెటర్నరీ డీడీలు డాక్టర్ కృష్ణ జ్యోతి, డాక్టర్ అంబేడ్కర్, ఏడీలు డాక్టర్ వెంకటరామయ్య, డాక్టర్ దినకర్, వెటర్నరీ వైద్యనిపుణులు డాక్టర్ జి.గిరీష్, డాక్టర్ రాజేష్‌బాబు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ సువర్ణ, పెంపుడు జంతువుల యజమానులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



పెంపుడు కుక్కకు వ్యాక్సినేషన్ వేస్తున్న జేడీ

లోక్ అదాలత్‌లో 1304 కేసుల పరిష్కారం

» ఎస్పీ బిందుమాధవ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కాకినాడ జిల్లాలో 1304 పోలీస్ కేసులు పరిష్కారం అయినట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదివారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.జిల్లాలో పెండింగ్ ట్రయల్, దర్యాప్తు దశలో ఉన్న కేసులు, ప్రత్యేక, స్థానిక చట్టాలకు సంబంధించిన మొత్తం 1304 కేసులు పరిష్కారమైనట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీస్‌స్టేషన్‌ల్లో కొట్లాట కేసులు, కుటుంబ తగాదా కేసులు ఇంకా ఇతర రాజీపడదగ్గ కేసులను గుర్తించి ఫిర్యాదుదారులకు, కక్షిదారులకు నోటీసులు అందజేసి వారిని న్యాయస్థానంలో రాజీపడేలా సంబంధిత పోలీస్ అధికారిని పర్యవేక్షిస్తూ వారికి సూచనలు చేస్తూ జిల్లాలో ఎక్కువ కేసులు న్యాయస్థానంలో రాజీ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో అత్యధికంగా జగ్గంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 116 కేసులు, గండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 116 కేసులు, అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 106 కేసులు పరిష్కారం అయినట్లు వెల్లడించారు. 1404 చిన్న కేసులు, పెట్టీ కేసులతో కలుపుకుని జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,708 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు.



ఆషాఢం!

ఆఫర్ల వల.. డిస్కౌంట్ల మాయ

ఆషాఢంలో ఆకర్షణీయమైన ప్రకటనలతో జనాలను బురడీ కొట్టించే మోళీ మొదలైపోతోంది. నిల్వ సరుకును అంటకట్టడం, నాసిరకంపై రెట్టింపు సొమ్ము లాగేయడానికి దుకాణాలకు ఓ మంచి అవకాశం చిక్కుతోంది. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకుని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఏకంగా 80 శాతం వరకూ రాయితీ ఇచ్చేస్తున్నారు. గతంలో ఈ మోసం లో కూడా కాస్త నిజాయితీ ఉండేది. రాను రాను మోసం పెరిగిపోయింది.దీంతో ఆ వస్త్రాలు మరో ఆషాఢాన్ని చూడలేకపోతున్నాయి. అయినా 'ఆషాఢం డిస్కౌంట్' మాట చెవిన పడగానే.. జనం ఎగబడడంలో మాత్రం డిస్కౌంట్ ఉండడం లేదు.ఆషాఢం మార్కెట్ మాయపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ఆషాఢం అంటే వస్త్ర దుకాణాలకు అసలు వ్యాపారం ఉండేది కాదు.. అటువంటిది ఒక్క ఐడియా వ్యాపారాన్నే మార్చేసింది.. జనాలను షాపుల చుట్టూ తిరిగేలా చేస్తుంది.. అదే డిస్కౌంట్..10 నుంచి 90 శాతం వరకూ డిస్కౌంట్ ఇచ్చేస్తున్నారు. జనం అలాగే ఎగబడి కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 వేలు పైనే వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో అత్యధికంగా ఒక్క రాజమహేంద్రవరంలోనే ఉంటాయి.ఈ ఒక్క ఆషాఢంలోనే కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుందని యజమానులే చెబుతున్నారు.ఎందుకంటే ఆషాఢం తరువాత వచ్చేది శ్రావణమాసం కావడంతో ఇప్పటి నుంచే సన్నద్ధమైపోతారు. డిస్కౌంట్ చీరలు కొంటారు.

నాడు వ్యాపారం నిల్.. నేడు ఫుల్..

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢం డిస్కౌంట్లకు ఎదురు చూసేవాళ్లూ లేకపోలేదు. వస్త్రాలు, చెప్పుల షాపుల వద్ద ఎక్కువగా రాయితీలు కనబడుతుంటాయి. వ్యాపారం ముసు గులో ఒకరికి మించి మరొకరు రాయితీలను ప్రకటిస్తుంటారు. ఆషాఢంలో సాధారణంగా పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. కొన్నేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. వ్యాపారులు ఆషాఢంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. రాను రాను ఆషాఢం సేల్స్ అంటే మోసానికి నిలువెత్తు నిదర్శనంగా మారిపోయింది. అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీ గా చూపించి ప్లాట్‌ఫాం సరుకును పెద్ద దుకా ణాల్లో సైతం అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు. దీనిపై ఎవరి నియంత్రణా లేదు. ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్రా అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయిస్తారు. రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర అంటే జనం ఎగబడతారు. వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ట చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు. ఎంఆర్పీపై కూడా తగ్గింపు ఇస్తున్నామంటూ దయ చూపించేస్తారు. వాస్తవానికి ఆ స్టిక్కర్లన్నీ వాళ్ల అంటించినవే కదా!. పైగా ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు కచ్చితంగా వినియోగదారుడికి ఉందనే విషయం ఎంత మందికి తెలుసు?.

రాయితీలో కిటుకు

ఆషాఢంలో క్లియరెన్స్ సేల్ కాస్తా డిస్కౌంట్ ధమాకాగా మారిపోయింది. ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు.లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు ఇవ్వరు. డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలను విపరీతంగా బాదేస్తుంటారు.

నకిలీ..మకిలీ!

ఆషాఢం సేల్స్‌లో భాగంగా బ్రాండ్ల పేరుతో బురిడీ కొట్టిస్తు న్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పు లు, హ్యాండ్ బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగి స్తున్నారు. ప్రముఖ బ్రాండ్లకు పోలిన నకిలీలను రాశులుగా పోస్తున్నారు. వాటిపై విపరీతమైన రేట్లు వేస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ యాంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతు న్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తున్నారు. ఉదాహ రణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నా డు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేక పోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 కూడా ఉండకపోవచ్చు. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండుకు అతి దగ్గరగా యాంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగ దారులు మోసపోతున్నారు.

» రండి బాబు రండి.. మోసపోండి
» ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ
» నాసిరకం.. ప్రముఖ బ్రాండ్లకీ నకిలీ
» జనం ఆశతో కోట్లలో వ్యాపారం

ఆధ్యాత్మికతకు.. 'నెల'వై!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

హిందూ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచేది ఆషాఢం..తెలుగు సంవత్సరంలో నాలుగో నెల. శూన్యమాసమైనా.. శుభకార్యాలు తలపెట్టకపోయినా.. పూజా కార్యక్రమాలకు, దేవతారాధనకు ఇది అనువైన సమయం. అందుకే ఈ మాసంలో అమ్మవార్ల జాతరలు జరుగుతాయి. కొత్త అల్లుళ్లకు ఆషాఢ పట్టీ వినోదాలు, మార్కెట్లలో ఆఫర్లు, తక్కువ ధరలతో వస్త్రాలు, వస్తువుల డిస్కౌంట్ సేల్.. ఇలా చెప్పుకొంటూ పోతే.. ఎన్నో విశేషాలు, వింతలకు ఈ మాసం నిలయం.ఈ మాసంలో పుడమి పులకించడంతో ఎక్కడ చూసినా ఆహ్లాదకరమైన హరిత వాతావరణమే కనిపిస్తుంది. దుమ్ము ధూళితో దర్శనమిచ్చే తరువులన్నీ తలంటు పోసుకున్నట్టుగా నిగనిగలాడుతుంటాయి. వ్యవసాయ పనుల ప్రారంభానికి అనువైన మాసం కావడంతో ఇంట్లో వారందరూ కష్టపడి పనిచేసేందుకు ముందుకు వెళ్లాల్సిన సమయం. ఆషాఢంలో వివాహాలు, గృహ ప్రవేశాలు చేయరు. ఇంటి నిర్మాణాలు చేపడితే ఆ ఇంటికి ధనధాన్యాలు, పశుసంపద, రత్నమాణిక్యాలు లబిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసాన్ని శుచి మాసం అని కూడా అంటారు. ఇంట్లోని కంచు, ఇత్తడి వంటి వస్తువులను శుభ్రపరచుకోవడం, బంగారం, వెండి వస్తువులను మెరుగుపెట్టించుకోవడం చేస్తుంటారు. ఈ నెల రోజులు గ్రామ దేవతల పేరుతో వెలసిన అమ్మవారికి పూజలు చేసి భక్తిభావంతో కొలుస్తారు. వారాహి గుప్త నవరాత్రులు ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఆషాఢ శుద్ధ తొలిఏకాదశి, ఆషాఢ పూర్ణిమ, ఆషాఢ బహుళ సప్తమి, ఆషాఢ బహుళ ఏకాదశి పర్వదినాలు ప్రత్యేకమైనవి. ఈ సమయంలోనే కాకినాడ జిల్లాలోని పెద్దాపురం మరిడమ్మ, తలుపులమ్మ లోవ, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయాల్లో భక్తుల సందడి ఉంటుంది. ఆషాఢంలో మునగాకును తప్పనిసరిగా తింటారు. మునగాకు కలిపిన కూరలు తినడంవల్ల ఒంటికి వేడి చేసి వర్షాకాలంలో ఒంటిని సమశీతోష్ణ స్థితిలో ఉంచుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

సొమ్ములూ పాయే.. స్థలమూ పోయే..

» మాజీ కార్పొరేటర్లను ముంచిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి
» స్థలాలు ఇస్తామని డబ్బులు వసూలు
» వెనక్కి తిరిగిరాని పైసలు
» ఆందోళనలో మాజీ కార్పొరేటర్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీఅధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు చేసిన అక్రమాలు, అరాచకాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కాకినాడ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న భర్త, వైసీపీ నేత విద్యాసాగర్, ఆయన సోదరుడు మాధవకృష్ణతో పాటు అనుసూరి సుబ్రహ్మణ్యం చేసిన భూ ఆక్రమణపై సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం అందరికీ తెలిసిందే. ఈ తరహా మోసాలు నగరానికి చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి నేతృత్వంలో చాలా జరిగాయనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. దీంతో చాలామంది అప్పట్లో కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు కూడా చేశారు. అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వాటిని అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో కొందరు జిల్లాఉన్నతాధికారులతోపాటు అమరావతిలో రాష్ట్రస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారు.

ఆశచూపి.. డబ్బులు వసూలు చేసి..

కాకినాడలో వైసీపీ కీలక నేత, మాజీ ప్రజాప్రతినిధి చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ఆయన్ను నమ్ముకుని వచ్చిన కొంతమంది కార్పొరేటర్లు(ప్రస్తుతం మాజీలు)ను నట్టేటముంచారు. తమ పార్టీలోకి వస్తే.. స్థలాలు ఇస్తామని ఆశ చూపారు. ఆ స్థలాలను మెరకగా చేయాలంటే రూ.లక్షన్నర వరకు అవుతుందని చెప్పి వారి నుంచి ఆ సొమ్ములు వసూలు చేసే బాధ్యతను ఓ మహిళా కార్పొరేటర్ భర్తకు, మరో కార్పొరేటర్‌కు ఆ ప్రజాప్రతినిధి అప్పగించారు. వాస్తవానికి 2017లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. కాకినాడ నగరంలోని 48డివిజన్లకు జరిగిన ఆఎన్నికల్లో 32మంది టీడీపీ, ముగ్గురు స్వతంత్రులు, ముగ్గురు బీజేపీ నెగ్గారు. వైసీపీ తరఫున మొత్తం పదిమంది విజయం సాధించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధి.. టీడీపీ, ఇతర కార్పొరేటర్లకు ఆఫర్లు ఇచ్చారు. తమ పార్టీలోకి వస్తే లక్షలు విలువచేసే స్థలాలు ఇస్తామని నమ్మబలికారు. చాలామంది ఆయన మాటలు నమ్మి ప్లేట్ ఫిరాయించారు. వైసీపీ కండువా వేసుకున్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ వెనుక సర్వే నెంబర్ 144/1, 144/3లలో భూదాన భూమికి సంబంధించి 4.7 ఎకరాల భూమిఉంది. అందులో 30మంది కార్పొరేటర్లకు వంద గజాల స్థలం ఇస్తామని, ఆ స్థలాన్ని మెరక చేసేందుకు ఒక్కొక్కరు రూ.లక్షన్నర వరకు ఇవ్వాలని సూచించారు. ఇదేదో భలే చౌక బేరమనుకున్న అప్పటి కార్పొరేటర్లు(ప్రస్తుత మాజీలు) ఆ సొమ్ములను ఆ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు, మహిళా కార్పొరేటర్ భర్త, మరో కార్పొరేటర్‌కు అప్పగించారు. దీంతో 20మందికి పైగా కార్పొరేటర్లు రూ.లక్షన్నర చొప్పున చెల్లించారు. దీంతో ఆ స్థలాన్ని మెరక చేయించారు. ఇంతలో కార్పొరేటర్లకు స్థలాలుగా ఇస్తామన్న భూమిని భూదాన బోర్డు తమకు ఇచ్చిందని కొందరు లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. దీనిపై కోర్టును ఆశ్రయించారు. దీంతో డబ్బులిచ్చిన కార్పొరేటర్ల పరిస్థితి అయోమయంగామారింది.

వారికి డబ్బులు పాయె..

తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆ ప్రజాప్రతినిధి మాజీగా మారారు. అప్పట్లో కార్పొరేటర్లు చెల్లించిన రూ.లక్షన్నర వెనక్కి రాలేదు. దీంతో స్థలం రాక, డబ్బులు తిరిగి అందక వారు ఇప్పటికీ డబ్బులు వసూలు చేసిన ఆ మాజీ కార్పొరేటర్ భర్తకు ఫోన్‌లు చేయడం విశేషం. పోనీ కోట్లు సంపాదించిన ఆ మాజీ ప్రజాప్రతినిధైనా కనికరిస్తాడనుకుంటే ఆ డబ్బులన్నీ మెరక పనులకే అయిపోయాయని, కావాలంటే ఆ మట్టి తీసుకుపోండనడంతో వారంతాలబోదిబోమంటున్నారు.

బడికి.. వెళదాం!



» రండి..రండి దయ చేయండి
» 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్
» కూటమి ప్రభుత్వంలో రెండోసారి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పాఠశాలలు, కళాశాలలు ముస్తాబవుతున్నాయి.. పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు సన్నద్ధమవుతున్నాయి.కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమావేశాలు నిర్వహించడం రెండోసారి. ఆ రోజున అమ్మపేరుతో మొక్కలు నాటడం, ఫొటో బూత్ వద్ద తల్లిదండ్రులతో ఫొటోలు దిగడం, ఆటలపోటీలు, సహపంక్తి భోజనాలు ఇలా పండుగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిసారి గతేడాది డిసెంబరు నెలలో నిర్వహించిన మెగా పీటీఎం విజయవంతం కావడంతో ఈసారి మెగా పీటీఎం-2.0 నిర్వహిస్తున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తెచ్చారు. వీటిని తల్లిదండ్రులకు వివరించడం, పాఠశాలల అభివృద్ధిలో వారితో పాటు పూర్వ విద్యార్థులు, విద్యారంగ ప్రముఖులు, దాతలను భాగస్వాములు చేయడం లక్ష్యంగా దేశంలోని విద్యారంగ చరిత్రలో తొలిసారి గతేడాది డిసెంబరు 7న నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సత్ఫలితాలను ఇచ్చింది. రెండో విడత ఈనెల 10న ఈ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-2.0(మెగా పీటీఎం) నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంపై ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్లు అన్ని జిల్లాల అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు ఇచ్చారు.సమావేశం ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై రాష్ట్రస్థాయి నుంచే మినిట్ టూ మినిట్ ప్రోగ్రామ్‌ను పంపించారు.

ఫొటో సెషన్, ఆటల పోటీలు

10న ఉదయం 9గంటలకు సమావేశాలు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిస్తారు. ఉదయం తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులను పాఠశాలకు ఆహ్వానిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే ఓపెన్‌హౌస్ ఫొటోబూత్ వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఫొటో దిగే ఏర్పాటు చేయనున్నారు. అనంతరం తమ పిల్లలతో కలిసి వారి క్లాస్‌రూమ్‌లో తల్లిదండ్రులు కూర్చునేలా, ఇతర ప్రముఖులు హెచ్ఎం రూమ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో సంబంధిత క్లాస్ టీచర్ ప్రత్యేకంగా సమావేశమై వారి పిల్లల సమగ్ర పురోగతి కార్డులు(ప్రోగ్రస్ కార్డు), హెల్త్ కార్డును అందిస్తారు. అదే సమయంలో వీడియోల ద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్, మన బడి మేగజైన్ తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోళి లేదా లెమన్ అండ్ స్పూన్ లేదా మ్యూజికల్ చైర్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. 11గంటలకు సమావేశాలు ప్రారంభించి మా తెలుగు తల్లికి పాట అనంతరం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశించారు.ఇందులో భాగంగా విద్యార్థులతో వారి తల్లులకు పుష్పాలు సమర్పించి పాదాలకు నమస్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. నో టూ డ్రగ్స్, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులవుతామంటూ సామూహిక ప్రతిజ్ఞ ఉం టుంది. చివరగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాకమిటీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఆహ్వానితులు కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని చేస్తారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కామన్ లంచ్ ఏర్పాటు చేయాలి.

పండుగలా పేరెంట్ మీట్ నిర్వహించాలి

పి.రమేష్, కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ అనేది ప్రతి పాఠశాలకు పండుగలాంటిది. మన ఇంట జరుపుకునే ఉత్సవం మాదిరిగా దీన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని పాఠశాలల్లోను 10న ఈ సమావేశాలు నిర్వహించాలి. ఇందులో ఎవరికీ మినహాయింపులు లేవు. ఇప్పటికే కార్యక్రమ నిర్వహణపై ఆయా పాఠశాలల హెచ్ఎంలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు చేయాల్సిన ఏర్పాట్లు, సమావేశ నిర్వహణ టైమ్ టూ టైమ్ షెడ్యూల్‌ను పంపించాం.

జేఎన్టీయూకే ఇన్‌ఛార్జ్ రెక్టార్, రిజిస్ట్రార్ల నియామకం

జేఎన్టీయూకే, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదేశాల మేరకు జేఎన్టీయూకే ఇన్‌ఛార్జ్ రెక్టార్, రిజిస్ట్రార్లను నియమిస్తూ ఆదివారంఉత్తర్వులు జారీచేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావును ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా నియమించగా ఇప్పటివరకూ ఆ విధులు నిర్వర్తించిన వి.రవీంద్రనాథ్‌ను బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వీవీ సుబ్బారావును ఇన్‌ఛార్జ్ రెక్టార్‌గా నియమించారు. ఇప్పటివరకూ విధులు నిర్వర్తించిన కేవీ రమణను బాధ్యతలనుంచి రిలీవ్‌చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ రెక్టార్, రిజిస్ట్రార్‌గా నియమితులైన సుబ్బారావు, శ్రీనివాసరావులను వీసీ ప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్లో సోమవారంఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఈకార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రాలేనివారు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవాలన్నారు.

స్పా సెంటర్లపై దాడులు

కాకినాడ క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): అసాంఘికకార్యకలాపాలకు తావులేకుండా కాకినాడ నగరం,రూరల్‌ప్రాంతాల్లోని స్పా సెంటర్‌లు,సెలూన్‌లపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, పోర్ట్, సర్పవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న అన్నిసెలూన్‌స్పాకేంద్రాలపై దాడులు నిర్వహించారు. స్పాసెంటర్లలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్‌పెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు.

భక్తులతో పోటెత్తిన సత్యదేవుడి సన్నిధి

తొలి ఏకాదశి పర్వదినాన

రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవుదినం ఏకాదశి పర్వదినంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉదయం 5గంటలనుంచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. వ్రతమండపాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఇటీవల వివాహాలు చేసుకున్న జంటలకు తొలిపండుగగా భావించే తొలిఏకాదశి రోజున స్వామిని దర్శించుకున్నారు. సుమారు 4వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సుబ్బారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సత్యదేవుడి దర్శనానికి బారులుతీరిన భక్తులు



సత్యదేవుడి ప్రసాదం కోసం క్యూలో ఉన్న భక్తులు

ప్రముఖుల పూజలు

సత్యదేవుడిని ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

1.20 లక్షల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావించే స్వామివారి గోధుమ రవ్వ ప్రసాదం అమ్మకాలు ఆదివారం ఒక్కరోజే రూ.1.20 లక్షల ప్యాకెట్ల విక్రయాలు జరిగినట్టు ప్రసాదం విభాగ అధికారి పోల్నాటి లక్ష్మీనారాయణ తెలిపారు. తొలిఏకాదశి సందర్భంగా రత్నగిరికి విచ్చేసిన భక్తులతో పాటుగా తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాల కు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై 2 నమూనాలయాలు, తొలిపావంచా వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్లలో కలిపి ఈ అమ్మకాలు జరగగా ఒక్క ప్రసాదాల విక్రయాల ద్వారా సుమారు రూ.24 లక్షల ఆదాయం సమకూరింది.

సత్యదేవుడి దేవేరికి

వజ్రాల నక్లెస్ బహూకరణ

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దేవేరి అనంతలక్ష్మి సత్యవతీ దేవికి ఆదివారం రూ.19 లక్షల విలువైన వజ్రాల నక్లెస్‌ను బహూకరించారు. పెద్దాపురం లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లలో ఒకరైన మట్టే ఆది శంకర్, స్రవంతి దంపతులు వీటిని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. ముందుగా ఆభరణం సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. దాతలను ఈవో అభినందించి స్వామివారి దర్శనం, వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్‌లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ సూర్యకమల దంపతులున్నారు. ఈ ఆభరణం నిత్యఅలంకరణ చేపట్టాలని దాత కోరారు.



వజ్రాల నక్లెస్



ఆలయ ఈవో సుబ్బారావుకు వజ్రాల నక్లెస్ అందజేస్తున్న దాత

ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు

రత్నగిరిపై వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం : టూరిజం అధికారులు



అన్నవరం దేవస్థానం అధికారులతో కలసి స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

అన్నవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు పడింది. గతేడాది నిధులు మంజూరై వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభంకాలేదు. దీనికి సంబంధించి టెండర్లు పిలిచి ఖరారుచేయగా సింహాచలం చందనోత్సవం సమయంలో గోడకూలి పలువురు మరణించడం, గోడకట్టిన నిర్మాణ కాంట్రాక్టర్ అన్నవరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో ఆ సంస్థను ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో మరోమారు టెండర్లను పిలిచారు. అన్నదాన భవనం, క్యూకాంప్లెక్స్, అధునాతన టాయిలెట్ల నిర్మాణాలకు కలిపి సుమారు రూ. 18.98 కోట్లతో టెండర్లు పిలవగా వాటిని తెరిచినా సాంకేతిక కారణాలతో వాటిని ఫైనల్ చేయలేదు. అయితే ఈ వారంలో టెండర్లు ఫైనల్ అవుతాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్టు టూరిజం అధికారులు తెలిపారు. ఆదివారం టూరిజం శాఖ ఎస్ఈ ఈశ్వరయ్య, డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేష్ ప్రసాద్‌స్కీం ద్వారా నిర్మించబోయే నిర్మాణాల స్థలాన్ని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈవో సుబ్బారావును కలసి టెండర్ల ఖరారుపై చర్చించారు. ఈ నిర్మాణాల్లో దేవస్థానం కేవలం పర్యవేక్షణ మాత్రమే చేయనుంది. నిధులు, కాంట్రాక్ట్ ఇతర పనులు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

తెలుగు టీచర్ ఔదార్యం

హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం

సర్పవరం జంక్షన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణాదేవిగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ చరిత్రను భావితరాల విద్యార్థులకు చాటి చెప్పేలా తెలుగు ఉపాధ్యాయురాలు సీతమ్మ విగ్రహం తయారు చేయించారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు ముత్య వెంకటలక్ష్మి. ఆమె చేస్తున్న విద్యాబోధన, ఇతర సేవా కార్యక్రమాలకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నారు. డొక్కా సీతమ్మ విగ్రహాన్ని హైస్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేయాలని భావించి విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకున్నారు. సుమారు రూ.78 వేలు వెచ్చించి కొత్తపేటకు చెందిన ప్రముఖ విగ్రహ శిల్పి రాజ్‌కుమార్ వడియార్‌తో విగ్రహాన్ని తయారుచేయించి హైస్కూల్‌కి తరలించారు. విగ్రహాన్ని సోమవారం డీఈవో రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి విద్యాశాఖ అధికారులు ప్రారంభోత్సవం చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు స్ఫూర్తితో డొక్కా సీతమ్మ చరిత్ర విద్యార్థులకు తెలపాలని విగ్రహాన్ని తయారు చేయించినట్టు రామలక్ష్మి తెలిపారు.



ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం



విగ్రహాన్ని తయారుచేయించిన ముత్య వెంకట రామలక్ష్మి

ఎస్ఐ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

నరసాపురం టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణలోని కోదాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ అశోక్ కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు రూ.25లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆంధ్ర, తెలంగాణలో వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఈ బ్యాచ్‌కు చెందిన 1140మంది సీఐలు, ఎస్ఐలు ఈ మొత్తాన్ని సేకరించారు. ఆదివారం ఎస్ఐ సొంత ఊరు నరసాపురంలో జరిగిన అశోక్ సంతాప కార్యక్రమానికి హాజరై ఎస్ఐ కుటుంబానికి అందించారు. పిల్లల చదువులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే ఈ ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బైసన్ జీవన్‌కు రూ.5 లక్షల సాయం చేశారు.



ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎస్ఐలు

వెయ్యి కిలోల పశుమాంసం స్వాధీనం

నలుగురిపై కేసు

గొల్లప్రోలు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులోని అనధికారిక పశు కబేళాపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడులు చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న వెయ్యి కిలోల పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా పశువులను వధించిన ఆరుగుల తాతయ్య, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్, మిరియాల రమేష్‌పై కేసు నమోదు చేసి 4 మోటారు సైకిళ్లు, మినీ ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. పశుమాంసాన్ని పూడ్చి కేసు దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌లో జరిగిన హత్యాయత్నం సంఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బైపాస్‌రోడ్డులో తాటిపర్తికి వెళ్లే రహదారి సమీపంలో జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసి అనిశెట్టి వంశీ అనే వ్యక్తిని జ్యోతుల రాము, ఊటా ఇంద్ర కత్తితో పొడిచిన సంగతి తెలిసిందే. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. అరెస్టు చేసిన ఇద్దరిపై చత్తీస్‌ఘడ్‌లో గంజాయి కేసులు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో 18 మందికి గాయాలు

కాట్రేనికోన, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. 18 మందిని కరిచింది. బాధితులు కాట్రేనికోన పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించినట్టు వైద్యాధికారి జి నీలిమ తెలిపారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు కాకినాడలో చికిత్స తీసుకుంటున్నారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన రౌతు శివ ఇంట్లో ఆదివారం తెల్లవారు జామున దొంగలు చొరబడి 50 తులాల వెండి, రూ.10వేలనగదు, టీవీ అపహరించుకుని పోయారు. గత శుక్రవారం బాధితుడి నానమ్మ చనిపోగా క్రతువుల కోసం మూడు రోజులుగా సోదరుడి ఇంట్లో ఉంటున్నారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన తుని రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 50 ఏళ్ల కలిగిన వ్యక్తిని నర్సీపట్నం రోడ్డు సమీపంలో రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. సంబంధీకులు 94906 19020లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడలో రెండు సహాయకేంద్రాల ఏర్పాటు
- ఇంజనీరింగ్ కోర్సుల షెడ్యూల్ విడుదల
- 7 నుంచి 16 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

జేఎన్టీయూకే, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన మొదటి పేజ్ నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జారీచేశారు. 7నుంచి 16 వరకూ ఏ ర్యాంకువచ్చినా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 26 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు మొత్తం 16,660 సీట్లుండగా అక్కా, జేఎన్టీయూకేలోని 2ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో 520 సీట్ల వరకూ ఉండగా, 24 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 16,140 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ జిల్లా పరిధిలో 6,343, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 2868, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 6011మంది విద్యార్థులు ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధించారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్: ఈనెల 7నుంచి 16 వరకూ
- ధ్రువపత్రాల పరిశీలన: ఆన్‌లైన్‌లో ఈనెల 7 నంచి 17వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 13నుంచి 18వరకూ.
- ఆప్షన్ల మార్పు: ఈనెల 19.
- సీట్ల కేటాయింపు: జూలై 22
- కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 23నుంచి 26 వరకూ
- తరగతులు ప్రారంభం: ఆగస్టు 4 నుంచి

సందేహాలుంటే...

అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల, కాకినాడ జేఎన్టీయూకేలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రంలలో సంప్రదించాలి.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలు

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా

అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్‌టికెట్, పుట్టినతేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించి అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ కొట్టాలి.

రజకుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ
- రాజమహేంద్రవరంలో రజకుల ఆకాంక్ష సభ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రజకుల అవసరాలను, వారి సమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వారిని ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర సామాజిక, న్యాయశాఖామంత్రితో రజక సంఘ ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రజకుల ఆకాంక్ష సభ నిర్వహించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేశారు. కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి వారికి అవసరమైన డిమాండ్లకు తన మద్దతు ఉంటుందన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రజకుల సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రజకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బీసీ కుల వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులకు మేలు చేకూర్చే జీవో 27ను అమలుపై రాష్ట్ర మంత్రులకు విన్నవించగా సానుకూల స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ రంగంలోని దోబీ పోస్టులు, కాంట్రాక్టులను రజకులకు కేటాయించేలా ప్రత్యేక జీవో తీసుకురావాలని కోరుతున్నామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రజకసేవా సంఘం నాయకులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, రజకులు పాల్గొన్నారు.



శ్రీనివాస వర్మకు వినతిపత్రం అందజేస్తున్న రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి



సభలో మంత్రి దుర్గేష్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో నవజాత శిశువు మృతి

బంధువుల ఆందోళన

ఐ.పోలవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో ఆదివారం నవజాత శిశువు మరణించడంతో బాధిత కుటుంబం, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే పుట్టిన బిడ్డ మరణించాడంటూ నినాదాలు చేశారు. ఐ.పోలవరం పంచాయతీ పెదమడికి చెందిన ధరణి కేశనకుర్రు పీహెచ్‌సీలో ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమె ప్రసవం కోసం టి.కొత్తపల్లి పీహెచ్‌సీలో చేరింది. ఆదివారం ఆమెకు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. పుట్టిన మగబిడ్డ కొద్ది సేపటికి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందినట్టు ఆరోపిస్తూ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఎస్ఐ రవీంద్రబాబు ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. దీనిపై సూపరింటెండెంట్ దయానాను వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. అయితే టి.కొత్తపల్లి ఆసుపత్రిలో తరచూ జరుగుతున్న ఇటువంటి సంఘటనలపై శాఖాపరమైన దర్యాప్తు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.



మృతిచెందిన నవజాత శిశువు



పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

13న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్ల ఎంపిక, ఒకరోజు ఉమ్మడి జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు రాజమహేంద్రవరంలోని వీకేవీటీ కళాశాలలో ఈనెల 13వ జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. పాల్గొనదలచిన వారు ఒరిజనల్ ఆధార్, పుట్టిన తేది ధృవీకరణపత్రాలు తీసుకురావాలని కోరారు. ఇందులో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి 17 వరకూ జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

తగ్గుముఖం పడుతోన్న గోదావరి ఉధృతి

2,18,257 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద ఆదివారం ఉదయానికి 10.90 అడుగుల నీటి మట్టం ఉండగా 2.11లక్షల క్యూసెక్కులు బ్యారేజ్ గేట్ల ద్వారా దిగువకు ప్రవహించింది. సాయంత్రానికి నీటి విడుదలను మరింత పెంచి ధవళేశ్వరం ఆర్మ్‌లో 50గేట్లను 40మీటర్లు, 20గేట్లను 80 మీటర్లు, ర్యాలి ఆర్మ్‌లో 43గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20 గేట్లు, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 39 గేట్లను 40మీటర్ల మేర పైకి ఎత్తి 2,18,257క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో బ్యారేజ్ దిగువ భాగం జలకళ సంతరించుకుంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా నమోదైంది. భద్రాచలం వద్ద 20.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 18.50 అడుగులకు చేరుకుంది.

కరెంటు బిల్లు.. గుండె ఝల్లు...

మలికిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మలికిపురంలో ఒక షాపింగ్ కాంప్లెక్సులో ఉన్న రెడీమేడ్ దుస్తుల షాపునకు జూలై నెల కరెంటు బిల్లు రూ.3,38,496 వచ్చింది. బిల్లును చూసి షాపులో అద్దెకు ఉంటున్న కె.యువకుమార్ ఆశ్చర్యానికి లోనయ్యాడు. వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపినట్టు తెలిసింది. గతంలో రూ.1500 నుంచి రూ.2వేల వరకు బిల్లు వచ్చేదని యువకుమార్ తెలిపాడు.



రూ.3,38,496 వచ్చిన బిల్లు

'లోవ'లో లక్ష తులసి పూజ

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం అమ్మవారికి పండితులు లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు వేలాదిగా పోటెత్తారు. ఆలయానికి రూ.8.50లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.



తులసి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడలో అంతర్ జిల్లా ఈత పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్విమ్మర్ గోలి శ్యామల

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఈత కొలనులో 10వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు జరిగాయి. సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ జాతీయ మార్తాన్ స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒకరు కూడా విద్యార్థి దశ నుంచే నడవడిక నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. మరో ముఖ్య అతిథిగా డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో గ్రూప్ బాయ్స్ విభాగం నుంచి కే.వీరశివకృష్ణ, ఎం.గోకుల కన్నా, కే ముత్యాల ముఖేష్, వి.మణికంఠ నవీన్, టి.దుర్గేష్.. గ్రూప్ వన్ గర్ల్స్ విభాగంలో పి.సహస్ర శ్రీ.. గ్రూప్ టుబాయ్స్ విభాగంలో టీవీసీ.సాయి సాకేత్, పి.కౌశిక్ వర్ధన్ మిచిల్ అర్జున్, ఏ.అభిసాయి, వై.గౌతమ్, ఏ అక్షిత, వీరాజ్ విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్.. గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సీహెచ్.హిమద్యోతి, కే.తనుశ్రీ.. గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో కే.దర్శిల్, ఎస్.క్రితిక్, ఎం.షణ్ముఖ్వీర్, ఏం.సాయిచరణ్, జి భువనేష్, జి.రోబిన్... గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్ గుల్బర్, జి.అన్విద, ఎం.పల్లవి, ఎం.ఆశస్విని ఎంపికయ్యారు. వారంతా ఈనెల 19, 20న విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పదోవ సబ్ జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీల్లో పాల్గొంటారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కోచ్‌లు ఎం.అజయ్‌కుమార్, పీఏ నాయుడు, వి.వీరభద్రయ్య, ఎల్.రాకేష్, జి.మురళీకృష్ణ ఈత క్రీడాకారులను ఎంపిక చేశారు.

'జూనో'లో జాలీగా..

– రాజమహేంద్రవరం సిటీ

జూనోసిస్ డే సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పశువుల ఆసపత్రి వద్ద వివిధ రకాల జంతువులను వ్యాక్సిన్ కోసం తీసుకొచ్చారు. ఆ చిత్రాలే ఇవి.





కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

20న 'జీవనదానం' పుస్తకావిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, హస్యామనిస్టు, నేత్రదాన ప్రోత్సాహక సంఘం వ్యవస్థాపకుడు పెన్మెత్స సుబ్బరాజు అవయవ దానం ప్రాముఖ్యతను, గొప్పదనాన్ని వివరిస్తూ రచించిన 'జీవనదానం' పుస్తకావిష్కరణ ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో జరగనుంది. కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ ఈ పుస్తకానికి ముందుమాట రాశారు.



పిఠాపురంలో ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి





సామర్లకోటలో విశేష అలంకారంలో విష్ణుమూర్తి, మాండవ్యనారాయణస్వామి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో నందీశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గొల్లప్రోలు మండలం దుర్గాడలో పుష్పాలు, తమలపాకులతో రామలింగేశ్వరస్వామికి అలంకారం

వైభవంగా తొలి ఏకాదశి

ఆలయాల్లో విశేష పూజలు

తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని విష్ణాలయాలు, శివాలయాలు, అమ్మవార్ల ఆలయాల్లో అర్చకస్వాములు, వేదపండితులు అభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు ధరింపజేసి పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరాలయంలోని విష్ణుమూర్తిని ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్న వేదమంత్రోచ్చారణలతో పంచద్రవ్యాలతో అభిషేకించారు. స్వామివారిని, లక్ష్మీదేవిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. మహిషాసురమర్దిని అమ్మవారికి చెరుకూరి రాంబాబు పూజలు చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. మాండవ్య నారాయణస్వామి ఆలయంలో కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పండితులు చక్రవర్తుల కుటుంబీకుల వేదమంత్రోచ్చారణలతో అభిషేకాలు జరిపారు. మహాలక్ష్మి అమ్మవారికి, నారాయణ స్వామిలకు విశేష పుష్పార్చన చేశారు. కమిటీ ప్రతినిధి వల్లూరి సీత ఆధ్వర్యంలో వంద మంది మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. రుక్మిణీ సమేత పాండురంగస్వామికి ఆలయ వ్యవస్థాపక కుటుంబీకులు రాజేంద్ర కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, పుష్పార్చన జరిపారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆయన తనయుడు రంగనాగ్, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్, బలుసు శ్రీనివాసు, బొండల రామలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామికి ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ జరిపారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. కుంతీమాధవస్వామికి, జైగణేష్ స్వామికి విశేష పూజలు జరిగాయి. వేణుగోపాలస్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోలస్వామికి అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువైన నందీశ్వరునికి పుష్పాలు, వస్త్రాలతో విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నందీశ్వరునిపై ఆశీనులు గావించగా భక్తులు దర్శించుకున్నారు. నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నందీశ్వరునికి జలాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. నందీశ్వరునికి పంచామృత సహిత సుగంధ ద్రవ్యాభిషేకాన్ని నిర్వహించారు. వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకశర్మ అభిషేకాలు, పూజలు జరిపించగా నందీశ్వరుడిని భక్తులు స్వయంగా జలాలతో అభిషేకించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, చెరుకు శ్రీను, అడపా నూకరాజు, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి పుష్పాలు, తమలపాకులు, విష్ణునామాలతో అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగే ఏకాహం ప్రారంభించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): తిరుపతి శృంగార వల్లభస్వామి, కట్టమూరు కేశవపట్టాభిరామ స్వామి, జి.రాగంపేట వేణుగోపాలస్వామి, పెద్దాపురం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్‌ఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఎమ్మార్వో కార్యాలయ ఫీడర్, కొత్తపేట, చిన్న వీధి, కోటపేట, ఉప్పువారి వీధి, బలుసులపేట, సంగీతరావుపేట, వీరాఘవపురం, నీలమ్మచెరువు ప్రాంతం, ఇందిరా కాలనీ, పెన్షన్ లైన్, 11కేవీఏ ఇండస్ట్రియల్ ఫీడర్, ఈటీసీ, వీబీఆర్ఐ ఫీడర్లు, అన్నపూర్ణమ్మ ఆలయ ఫీడరు, విఘ్నేశ్వర థియేటర్ ప్రాంతం, మఠం సెంటర్, కొతూరు, నిమ్మతోట, సంపంగితోట, తాండ్ర పాపారాయుడు విగ్రహం కూడలి ప్రాంతం, గణపతినగరం, 11కేవీఏ రైల్వే స్టేషన్ ఫీడర్, బ్రౌన్‌పేట, గణేష్‌కాలనీ, సీతారామరాజు దళిత కాలనీ, యానాదుల కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.



చిత్తులూరి రాజాను సన్మానిస్తున్న రంగనాగ్

లయన్స్ భీమేశ్వర క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుక

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట లయన్స్ భీమేశ్వర క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ లయన్స్ భవన అధునాతన, శీతలీకరణ పనులను ప్రారంభించారు. లయన్స్ ప్రతినిధులు చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వరకుమార్, డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా క్లబ్ అధ్యక్షులుగా చేసిన వారిని సత్కరించారు. వివిధ రంగాల్లో సేవలందించిన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ బాలగంగాధర్ తిలక్, రీజనల్ చైర్మన్ గంగాధర్, లింగమల్లు కృష్ణమూర్తి, సత్యవోలు సూర్యనారాయణ మూర్తి, సేపేని సురేష్, కర్రి ఆదినారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, బలుసు శ్రీనివాసు, జనసేన నాయకుడు సరోజావాసు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన బాక్సర్లు

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఐదుగురి ఎంపిక

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను న్యాయవాది సీహెచ్ శ్రీనివాస్ ప్రారంభించగా 50 మందికి పైగా బాల, బాలికలు పాల్గొన్నారు. సబ్ జూనియర్ బాలురు 37 కేజీల విభాగంలో డీవీఎస్ పవన్‌కుమార్ (కొమరగిరి), 43 కేజీల విభాగంలో కేకే వీరారెడ్డి (కాకినాడ), 46 కేజీల విభాగంలో బోను జయదీప్ (పిఠాపురం), 70 కేజీల విభాగంలో సీహెచ్ లోహిత్ (పిఠాపురం), బాలికలు 40 కేజీల విభాగంలో షేక్ హమీదా (పిఠాపురం) స్వర్ణ పతకాలు సాధించారు. విశాఖపట్టణంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు వీరు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.కృష్ణపవన్ వ్యవహరించగా... పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.లక్ష్మణరావు పర్యవేక్షించారు. జూనియర్స్ ఓపెన్ విభాగంలో జె.గౌతమ్ (కొమరగిరి), పి.తేజ, జీఆర్ అరుణతేజ (పిఠాపురం) స్వర్ణ పతకాలు, జేఆర్ ఆదిత్య రజత పతకం సాధించారు.





సామర్లకోట మండలం పవరలో ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం ఇస్తున్న మంత్రి సుభాష్

సుపరిపాలనలో తొలి అడుగు... ఇంటింటా ప్రచారం

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా పండ్రవాడ, పవర గ్రామాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ నాయకులు ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనువాసు, చీకట్ల వెంకటేష్, ఆకునూరి సత్తిబాబు, ముచ్చెర్ల కళ్యాణ్, పెంకే వెంకటేష్, అడ్డాల వెంకన్నబాబు, నరాల వెంకటరమణ, పరిమి శ్రీనివాసు, వెన్నా చిన్నీ, తలాటం అత్యుతరామయ్య, ముమ్మిడి సూరిబాబు, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంద్రపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం, పలువురు పేదలకు ఆర్థిక సహాయం అందజేశారు. చీడిగలోని దశావతార వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీటీసీ, కాకినాడ జిల్లా యాదవ సంక్షేమసంఘం అధ్యక్షుడు మానుమేను గంగయ్య, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా, మరుకుర్తి నాగబాబు, తేజాయాదవ్, నురుకుర్తి వెంకటేశ్వరరావు, పితాని అప్పన్న, జన సైనికుడు గవర శ్రీరాములు పాల్గొన్నారు.



కాకినాడ 47వ డివిజన్‌లో అభివృద్ధిని తెలిపే కరపత్రాలను అందజేస్తున్న కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ 47వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, కాకరపల్లి చలపతిరావు, గొల్లపల్లి శ్రీనివాస్, ఏటుకూరి నాగమణి, కర్రి శ్రీను, గుడాల లోవరాజు, మందరపు చిట్టిబాబు, గుబ్బల బాస్కరరావు, కముజు నెహ్రూ, పిల్లి వీరభద్రరావు, వాసంశెట్టి సత్తిబాబు, గుమ్మళ్ల శ్రీను, కంచిమర్తి లావణ్య, పొదరపు ఉమ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత టేకుమూడి లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం పోలేకుర్రు పంచాయతీ తోటపేటలో యూనిట్ ఇన్‌చార్జి జక్కల ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, సాదనాల శివరామకృష్ణ, పూడా రాంబాబు, సాదనాల ప్రసాద్, నిమ్మకాయల మూర్తి, మోర్త భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా ఏకలవ్య జయంతి

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య జయంతి సందర్భంగా పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ వద్ద ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ కౌన్సిలర్, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కావడి పోశయ్య, బండి చింతాలు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి వీరలంక, సజ్జా రాజేంద్ర, మానుపాటి ఈశ్వరరావు, బాలరాజు, బండి నూకరాజు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, గాలి కోటేశ్వరరావు, పోలిశెట్టి శేఖర్, సూరంపూడి బాలు, కావడి చిన్నికృష్ణ, పెద ఏసు, మానే పోతురాజు, చిన ఏసు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సేవాతత్పరురాలు మండపాక రాఘవమ్మ 22వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో ఇద్దరికి వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పెద్ద మార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద మండపాక వీరనాగన్న, సుబ్బు కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, ఎంవీవీ సత్యనారాయణ, ఎం.శ్రీను, వనమర్తి సుబ్బారావు, ఎం.సాయిరాం, అడపా జగదీష్, ఎం.నాగబాబు, ఫిరోజ్ పాల్గొన్నారు.



రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గంతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యవర్గ సమావేశం రోటరీ క్లబ్ హాలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ గోపీనాథ్, కార్యదర్శిగా డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారిగా వి.ఉదయచక్రవర్తి ప్రమాణం చేశారు. ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్‌గా అప్పసాని కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడిగా ఎం.పవన్, క్లబ్స్ ట్రైనర్‌గా వి.ఆనంద్, ఫౌండేషన్ చైర్మన్‌గా డాక్టర్ ఎస్.రామకృష్ణ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా చోడిశెట్టి పెద్దరాజు, పబ్లిక్ ఇమేజ్ కమిటీ చైర్మన్‌గా ఆర్.గోవిందరాజులు, సర్వీస్ ప్రాజెక్టు చైర్మన్‌గా నల్లమిల్లి మాచారెడ్డి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నరహరిశెట్టి రవికృష్ణ, హ్యాపీ స్కూల్స్ రోటరాక్ట్, ఇంటరాక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎస్.చిరంజీవిరెడ్డి, పల్స్‌పోలియో ప్రోగ్రాం కమిటీ చైర్మన్‌గా ఎస్.ఉదయభాను, క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ మొండి రవికుమార్, డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు.

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

కాకినాడ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం తేవాలని తదితర డిమాండ్లతో ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆటో ప్రచారాన్ని ఇంద్రపాలెం బ్రిడ్జి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ ఆదివారం ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు అంకాడి పద్మావతి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, డీవీఎస్ రాజు, పట్టణ శాఖ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, కర్నీడి తాతీలు, సింహాద్రి, వంగూరు పవన్, నందకిశోర్, సూర్యనారాయణ, నూకరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు భక్తుల రద్దీ

పెద్దాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు రెండో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 25వేల మంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటుచేసి క్యూలైన్లలో టెంట్లు వేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పశు వైద్యశాల ఆవరణలో లయన్స్ భీమేశ్వర క్లబ్ నూతన అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ ఇ.ప్రమీల పర్యవేక్షణలో నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించగా 280 పెంపుడు కుక్కలకు డాక్టర్ ప్రమీల యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కాకినాడ ఏడీ డాక్టర్ పీవీ వరప్రసాద్, చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వరకుమార్, సేపేని సురేష్, కానుబోయిన విజయకృష్ణ, మేకా శ్రీను, బడుగు బాబీ, మాజేటి కృష్ణ, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), బలుసు శ్రీనివాసు, జనసేన నాయకులు సరోజా వాసు, తుమ్మల ప్రసాద్ పాల్గొన్నారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సుమారు రూ.4లక్షల వ్యయంతో సత్యవోలు సూర్యనారాయణమూర్తి సౌజన్యంతో నిర్మించిన వైద్యపరీక్షశాల, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, అవుట్ పేషెంట్లు వేచి ఉండే హాలును ఎమ్మెల్యే చినరాజప్ప ప్రారంభించారు.

'పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలి'

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టకుండా ప్రభుత్వాలు తీసుకువచ్చిన పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నండూరి ప్రసాదరావు భవనంలో నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు సీహెచ్ సాంబశివ, సత్యనారాయణ, రమణ, వీరబాబు, గోవిందు, రవి, నందీశ్వరరావు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు

పిఠాపురంలో వర్షం

పిఠాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం పడింది. రాత్రి వర్షం పడటంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు. రహదారులు జలమయమయ్యాయి. గొల్లప్రోలు పట్టణంలో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం, ఆదివారం రాత్రి స్వల్ప వర్షం కురిసింది.

శాకంబరిగా ముత్యాలమ్మ అమ్మవారు

సామర్లకోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయ దీపారాధన సంఘం ప్రతినిధుల సౌజన్యంతో 35 రకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

చిన్నారులకు వికాస తరగతులు

కిర్లంపూడి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా చిల్లంగి పెరికల రామాలయం వద్ద ఆదివారం వికాస తరగతులు నిర్వహించారు. దిడ్డి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు భగవద్గీత, గోవింద నామాలు, విష్ణు సహస్రనామాలను ఆలపించారు. సంపర రామ్‌కుమార్, దిడ్డి గణపతి, దిడ్డి మురళీ క్రిష్ణ, దిడ్డి చిట్టి బాబు, దిడ్డి సంతోష్, గోడే బుజ్జి, సంగన వీరబాబు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విశ్వ గోండీ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా శ్రీను

చింతూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశ్వ గోండీ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా శ్రీను కోరారు. ఆదివారం చింతూరులో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా జూలై 21న విశ్వ గోండీ భాషా దినోత్సవం జరుపుకుంటున్న క్రమంలో ఈ దఫా ప్రభుత్వమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భాషా పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. మన్యంలో ఉన్న పాఠశాలల్లో ప్రాథమికంగా కోయ భాషలోనే బోధన నిర్వహించాలన్నారు. దీంతో డ్రాప్ అవుట్స్ నిలువరించే అవకాశం ఉందన్నారు. బోధన కోసం స్థానిక ఆదివాసీ యువతలో అర్హులను నియమించి వారికి నెలకు రూ.20 వేలు వంతున గౌరవ వేతనం చెల్లించాలన్నారు. ఆదివాసీ సంప్రదాయ గ్రామ పెద్దలకు ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించి ఆదివాసీ సంస్కృతిని కాపాడాలన్నారు. జీవో నెం 3ని తిరిగి అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులైన ఆదివాసీలకు స్థానికంగానే పునరావాసం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పొడియం వెంకటేశ్వర్లు, రాజు, మడకం జోగారావు, ముర్రం అఖిల్, కొర్సా వీరబాబు, పాయం లక్ష్మణ్, తుర్రం విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో తొలగింపులపై చర్యలేవి ?

చింతూరు, జూలై6(ఆంధ్రజ్యోతి): చింతూరులో అటవీ భూముల్లో గిరిజనేతరులు నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటుచేసుకున్న విషయంపై తాము ఇచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆదివారం ప్రశ్నించారు. ఒకవేళ గిరిజనులు ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటే మాత్రం తొలగిస్తున్నారని, గిరిజనులంటే అటవీ శాఖకు అలుసా? అని ఆయన ప్రశ్నించారు. దీనిపై చింతూరు డీఎఫ్‌వో సమాధానం చెప్పాలన్నారు.

తొలి ఏకాదశి పూజలు



కోదండ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం కోదండ రామాలయంలో వేకువజాము నుంచి తొలి ఏకాదశి పండుగ ఘనంగా నిర్వహించారు. రామాలయం ప్రధానార్చకుడు పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఏడాది పొడవునా ప్రజలు నిర్వహించుకునే పలు పండగలకు ఆది పండుగ తొలి ఏకాదశి అని ఆయన భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత రామారావు

మోతుగూడెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులు, చట్టాల అమలుపై నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయని, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల అభివృద్ధి కుంటుపడిందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లతా రామారావు అన్నారు. చింతూరు మండల మహాసభలో ఆయన ఆదివారం ప్రసంగించారు. కేంద్రం కార్పొరేట్లకు ఏజెన్సీ పీసా చట్టం అనుమతి లేకుండా దౌర్జన్యంగా ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు చట్టాలను ధిక్కరిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం టైగర్ జోన్ పేరుతో ఏజెన్సీ గ్రామాలను ఖాళీ చేయించేందుకు కుట్రలు చేస్తోందని, ఈ విధానాలపై ఆదివాసులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఆదివాసి ప్రాంత ఉద్యోగాలను ఆదివాసీలతో భర్తీ చేస్తానన్న సీఎం చంద్రబాబు తన వాగ్దానాన్ని తుంగలోకి తొక్కి మెగా డీఎస్సీ పేరుతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఏడాదిగా ఉద్యోగ నియామకంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సీసం సురేష్, మెట్టు రాజయ్య, వేకా రాజ్‌కుమార్, సోడి చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ.. చింతూరు మండల గిరిజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కారం నాగేష్, ముట్టుం రాజయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వ్యాకా రాజ్‌కుమార్, పాండు నాగార్జున, సహాయ కార్యదర్శులుగా కలుముల మల్లేష్, షోడే చిన్నమ్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తదితరులున్నారు.

రంపచోడవరం ఏఎంసీ చైర్మన్‌గా లక్ష్మణరావు

రంపచోడవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నూతన చైర్మన్‌గా లోతా లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా సలాది బాపి రాజు ఎన్నికయ్యారు. ఏఎంసీ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నూతన పాలకవర్గం రైతులకు ప్రయోజనాలు కల్పించే లా కృషిచేయాలని కోరారు. సభ్యులుగా ఆచంట శ్రీనివాసరావు, జయమ్మ, మాణిక్యం, జి.రాంబాబు, సత్యనారాయణమ్మ, రామారావు, సాల్మన్ రాజు, శివశంకర వరప్రసాద్, సత్యవతి, అమ్మాజీ, పి.రాంబాబు, గీతాంజలి ఎన్నికయ్యారు. కమిటీ నియామకంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

జనసేన నాయకుల పరామర్శ

దేవీపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): శరభవరం గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్వర్లు ఆయన కుమారుడు అనిల్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. చికిత్స అనంతరం వారు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా జనసేన నాయకురాలు పండా వరలక్ష్మి దంపతులు, కార్యకర్తలు పరామర్శించారు. ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు చారపు వెంకట రాయుడు, కర్రి మహేష్, సురిబాబు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా!

రంపచోడవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మన్యంలో తాము చేసిన అభివృద్ధి, ఏడాది కాలంలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే శిరీషదేవిని, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రశ్నించారు. ఆదివారం రంపచోడవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధికి మించి కూటమి ప్రభుత్వంలో జరగడం లేదని పేర్కొన్నారు. ఆమె వెంట వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

పాపికొండలకు మూడు బోట్లు

దేవీపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు ఆదివారం మూడు బోట్లలో 140 మంది పర్యాటకులు వెళ్లారు. పోశమ్మ గండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి ముంపు పరిటూరు కచ్చులూరు, తాళ్లూర, నడిపూడి వెళ్లారు. కొండమొదలు తదితర గ్రామాల మీదగా పేరంటాలపల్లి వెళ్లి సుమారు రెండుగంటల సేపు సందడి చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఎరుపెక్కింది.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
● పలుచోట్ల సుపరిపాలన కార్యక్రమాలు



గండేపల్లి: మల్లేపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఏలేశ్వరం: రమణయ్యపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

గండేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మల్లేపల్లిలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ హాజరై ప్రభుత్వ పథకాలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పల రాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, క్లస్టర్ ఇంచార్జ్ అడబాల భాస్కరరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు తెలగరెడ్డి భద్రరావు, సుంకవిల్లి రాజు, దాపర్తి సీతారమయ్య, దిడ్డి చిన్న శ్రీను, తెలగ రెడ్డి ప్రకాష్, దార్లంక శ్రీనివాసు పాల్గొన్నారు.

సుపరిపాలనే లక్ష్యం

ఏలేశ్వరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమంతో పాటు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం రమణయ్యపేటలో టీడీపీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకలు జ్యోతుల పెదబాబు, మీసాల రాజు, బస్సా ప్రసాద్, కోరుకొండ నూకరాజు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం



స్వామి,అమ్మవార్ల రథోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

అన్నవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవ రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి రథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల గోవిందనామ స్మరణలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

ప్రచార వాహనం ప్రారంభం



తొలిఅడుగు ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ నూతనంగా తయారు చేయించిన ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు ప్రచార రథాన్ని ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌కుమార్, ఎస్వీఎస్ అప్పల రాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, రేఖ బుల్లి రాజు, గద్దె అబ్బన్న, ఉండవిల్లి బుల్లిరాజు, బస్వా చినబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. మన్యం వారిపాలెం నుంచి స్థలం విషయంలో మునువర్తి వీర్రాజు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, పోట్రూ కృష్ణ, పోట్రూ రాముడు, మీసాల సత్తిబాబు పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో ఎన్‌సీసీ క్యాంపు విజయవంతం



శిక్షణ పొందిన వారితో ఎన్‌సీసీ ఆఫీసర్లు

గండేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సీసీ క్యాంపు విజయవంతంగా ముగిసినట్టు 18 ఆంధ్ర బెటాలియన్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 570మంది వచ్చినట్టు తెలిపారు. రక్తదానం, సైబర్ సెక్యూరిటీ డ్రోన్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. క్యాంపు నిర్వహణకు ఆదిత్య యాజమాన్యం అందించిన సహాయ, సహకారాలకు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డికి మేజర్ మహమ్మద్ అసిఫ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నర్ రితిన్ మోహన్ అగర్వల్, 6ఆంధ్ర నావల్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జూలై 6(ఆంధ్రజ్యోతి): జగపతినగరంలో రాజు హాస్పటల్ దగ్గర జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ కిర్లంపూడి మండలాధ్యక్షుడు శరణం రాజబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పసుపులేటి సత్తిబాబు, సత్యనారాయణమూర్తి, బుద్ద పెద్ద కాపు, ఇసరపు శివబాబు, శరణం కన్నారావు, దాడి వెంకటేష్, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం జగ్జీవన్‌రామ్



ఏలేశ్వరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. ఆదివారం ఆయన నివాసం వద్ద జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి, పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాస్, దత్తి రామకృష్ణ, చందక శేషు పాల్గొన్నారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట దళితపేటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొత్తపల్లి సంజీవరావు, కొత్తపల్లి పెద్దోడు జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొండయ్య దొరకు నివాళి



గండేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మాజీ డైరెక్టర్, గృహ నిర్మాణశాఖ మాజీ డైరెక్టర్ కందుల కొండయ్య దొర ఐదో వర్ధంతిని మురారి గ్రామంలో జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయి తేజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొండయ్య దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండయ్య దొర ఏ పదవి చేసిన ఆ పదవికి వన్నెతెచ్చిన నాయకుడున్నారు. కార్యక్రమంలో కందుల విజయ్, కందుల వినయ్, కందుల కొండయ్య చౌదరి, కందుల గోవింద చౌదరి, కంటే సురేంద్ర ఉండవల్లి వరప్రసాద్, కురుకూరి వీర వెంకట చౌదరి, ఉండవిల్లి బుల్లిరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఏలేశ్వరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు పేర్కొన్నారు. ఆదివారం పీపీపీ నేతృత్వంలో ముద్రగడ వీరేంద్ర, గోళ్ల సతీష్‌కుమార్, చల్లా రవీంద్రలు షిరీ నగర్, మెయిన్ రోడ్డు, లింగంపర్తి రోడ్డులో 50మొక్కలు నాటారు. గోళ్ల నాగేశ్వరరావు, గుర్రం లోవరాజు, బంక రాజు, పెచ్చేటి కృష్ణ పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి

ప్రత్తిపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర ఆలయంలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని 24 గంటలు ముందుగానే జిల్లా నలుమూలల నుంచి ఆశ్రమానికి భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం అశ్వపూజను, కాలపూజను స్వామి అనుజ్ఞ, అంకురార్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లటి అశ్వాన్ని వేద పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. తిరువన్నామలై, ఆరుళ్ళగు అరుణాచలేశ్వర దేవస్థానం అర్చకులు డాక్టర్ టి.అరుణాచల కార్తికేయ శివాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు యాగశాల నిర్మాణం, కాలపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, ధర్మపురి పీఠానికి చెందిన చుక్కాస్వామి, సినీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ, విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం, సినీనటుడు కృష్ణంరాజు సతీమణి తదితరులు పాల్గొన్నారు.



అంకురార్పణ చేస్తున్న దృశ్యం



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంజీ ప్రసాద్

మంత్రి సుభాష్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగుల వినతి

ప్రత్తిపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఆదివారం ఏపీసీఆర్పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఆదివారం కాకినాడ విచ్చేసిన మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేసి రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

తునిలో వేప, రావిచెట్లకు కల్యాణం



మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కల్యాణ వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

తుని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేప, రావిచెట్టుకు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణ వేడుకను పండితులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి దంపతులు వేప, రావిచెట్టుకు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని చేపట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, పూడి సత్యవేణి, చల్లకొండ సతీష్, ముల్లేటి గణేష్, వాసంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జూనోసిస్ దినోత్సవం

ప్రత్తిపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను ఆదివారం ఎమ్మెల్యే సత్యప్రభ ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని అన్ని పెంపుడు కుక్కలతో పాటు గ్రామాల్లోని వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకు డాక్టర్ చిక్కాం జోగేశ్వర్, శంఖవరం సహాయ సంచాలకు డాక్టర్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘బూటకపు హామీలు ఇచ్చిన ప్రభుత్వం’

జగ్గంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి ప్రభుత్వం మోసం చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో ఉన్న ఫంక్షన్‌హాల్‌లో వైసీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాజా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా పరిశీలకుడు దాట్ల సూర్య నారాయణరాజు, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు రఘురాం, ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, జగ్గంపేట మండలాధ్యక్షుడు రావుల గణేష్ రాజా తదితరులు పాల్గొన్నారు

తొలి ఏకాదశి పూజలు

తొండంగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా ఏవీ నగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

బీసీ హాస్టల్లో మున్సిపల్ సెక్రటరీ తనిఖీలు

తుని రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ పాఠశాలను బీసీ వెల్ఫేర్ మున్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత లోపాలు పరిశీలించి వంటశాలలో సరుకులు తనిఖీ చేశారు. మెనూ తప్పకుండా అమలు చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.



ఒమ్మంగిలో జరిగిన పీ4 సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఆర్థిక అసమానతలు తగ్గించడానికి ప్రభుత్వం కృషి

ప్రత్తిపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని ఒమ్మంగి లక్ష్మి ఫంక్షన్ హాల్లో ఆదివారం నియోజకవర్గ స్థాయి పీపుల్స్ సమావేశం బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీ4 ద్వారా అట్టడుగు ఉన్న 50శాతం పేద ప్రజలను సంపన్నులైన వారు కనీస అవసరాలు తీర్చేందుకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. శ్రీనివాసరావు పీ4లో చేపట్టే కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, బద్ది రామారావు, ఇతంశెట్టి భాస్కర బాబు, పల్లా గోపీ, ఇళ్ళ అప్పారావు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ళ రాజ్యలక్ష్మి, అమరాది వెంకట్రావు, మూది నారాయణ స్వామి, సత్యంశెట్టి సీతారాం, బొదిరెడ్డి గోపీ, అలమండ చలమయ్య, జనసేన జిల్లా నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్, దాసం శేషారావు, ఎంపీడీవోలు ఎంవీఆర్ కుమార్‌బాబు, లక్ష్మారెడ్డి, సూర్యనారాయణ, రామాంజనేయుల, ఏలేశ్వరం కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు

తొండంగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏవీనగరంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల నాగేశ్వర్రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను ఇంటింటికి పంచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, కొయ్యా శ్రీను, యనమల వరహాలు, సింగన్న పాల్గొన్నారు.

బూరుగుపూడిలో...

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పాటంశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నేతలు కుంచే తాతాజీ, పాటంశెట్టి రవి పర్యవేక్షణలో జరిపారు. ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు మూరా సత్తిబాబు, కర్నాకుల పెద్దకాపుస్వామి, పాటంశెట్టి కొండ్రాజులు, పాటంశెట్టి నాగ్వేరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శరభవరంలో తొలి అడుగు

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్‌నగరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి తరలివెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, ఇళ్ళ అప్పారావు, రేమాల అప్పలరాజు, తటవర్తి సుబ్బారావు, జింకల తాతారావు, బి.నారాయణుడు, పుణ్యమంతుల రాజా పాల్గొన్నారు.